# పద్మినీ పరిణయం

రచన: వి. యస్. యస్. మూర్తి




అదికాదురా! ఎలా ఊరుకోమంటావో నువ్వే చెప్పు? మొన్న ఎక్స్‌కర్షన్‌కి వెళ్లేటప్పుడు, రీడర్‌గా నేను నిలబడితే, నాకు పోటీ ఆ కమలను నిలబెట్టారు. ఈ మీసంవున్న మగజాతి మగవెధవలంతా ఆ మీసం లెస్ లేడీనే గెలిపించారు కదరా! దొంగవెధవలు!' ఇంకా యేదో అనబోతున్నాడు వాసు.

'ఇంక ఆపరా!' భయపడుతూ అన్నాను నేను. వీణ్ణి ఇంకా ఇలావాగనిస్తే ఆ కమలకి ఓట్లు వేసినవాళ్ళని (నన్నుకూడా కలిపి) యింకెంత తిడతాడో అని. నిజానికి, వీణ్ణి లీడర్‌షిప్‌కి నిలబడమని ప్రోత్సహించింది నేనే! కాని వాడికి నా ఓటు వెయ్యలేక పొయ్యాను. కారణం చెప్పమంటే........

'అదికాదురా' నా ఆలోచనలకి బ్రేక్‌వేస్తూ అన్నాడు. 'నేను నిలబడను మొర్రో అంటే నిలబడమని నా ప్రాణంతీసి, మీయింటివాళ్ళ అమ్మాయి రిక్వెస్ట్ చేసిందని, ఆ కమలకు ఓటు వేస్తావట్రా!' బాధగా అన్నాడు.

'ఎవడు చెప్పాడు నీకు' అనుమానంగా అన్నాను.

'నువ్వే మరొకడితో చెప్తే, ఆమరొకడుగాడు నాకు చెప్పాడు. సరేలే. ఈ మాట నేను కల్చరల్ ఎసోసియేషన్ తరపున సెక్రెటరీగా నిలబడదా మనుకుంటున్నాను. ఈమాటేనా నాకు సహాయంచేస్తావా? మీ యింటి అమ్మాయి పద్మినికూడ నిలబడుతుందటలే! ఆమెకే ఓటు చేస్తావా? ఆడవాళ్ళకి ఓటు వెయ్యడమంటే భలేసరదాలే నీకు!' అన్నాడు ఎత్తిపొడుస్తూ.

'క్షమించరా నాయనా! కిందటిసారంటే బుద్ధి గడ్డితిని యేదో వెధవపని చేశాను. అందులో లాభంలేకపోగా ఆడలీడరువల్ల మొగాళ్ళకు బాధ ఎక్స్‌కర్షన్‌లో చూశానుకదా! యింకా వేస్తానంట్రా నా ఓటు ఆడవాళ్ళకి? ఈమాటు నువ్వు గెలవకపోతే ఒకపక్క మీసం తీసేసి తిరుగుతా! సరేనా!' అన్నాను ప్రతిజ్ఞ చేస్తూ.

'అదేరా నాక్కావలసింది'

'ఏది? నేను మీసం తీసెయ్యటమా?' అన్నాను ఆశ్చర్యపోతూ.

'అబ్బ! కాదురా! నేను గెలవడానికి నీ సహాయం. నేను గెలవాలంటే నువ్వు పట్టు పట్టాల్రా. అరేయ్....నీకు తోక ఒక్కటే లేదు గాని....' అంటూ పొగడ్తలు మొదలెట్టాడు.

యిద్దరు కలసి కాలేజీకిచేరాం. అక్కడ అప్పుడే రెండు నామినేషన్‌లు తయారయినయ్. ఒకటి పద్మినిది. రెండోది కమలది. మేంకూడ మావాడిపేర ఒక నామినేషన్ పడేసి వచ్చేశాం.

'ఒరేయ్! మరి ఎడ్వర్‌టైజ్‌మెంట్‌సంగతి' అంటుండగానే మా మిత్రత్రయంలో మూడవవాడైన గోపీకూడా వచ్చేశాడు.

'కంగ్రాచ్యులేషన్స్ మిస్టర్ గోవిందవల్లభ వరాహ వాసుదేవరావ్'

అనడమే తడవు, కస్సుమంటూ లేచాడు వాసు 'నీకేం బుద్ధిగట్రా లేదట్రా? ఎన్నిమార్లు చెప్పాలి నన్ను అంతపేరెట్టి పిలవ్వద్దని? 'వాసుదేవరావు' అని గెజెట్ పబ్లికేషన్ చేయించినా నువ్వింకా ఆ పాతపేరెట్టి పిలుస్తావేం? జాగ్రత్త!' అంటూ అరవసాగాడు.

'ఏయ్ మిస్టర్!' ముగ్గురం గుమ్మంవేపు తిరిగాం. గుమ్మందగ్గర పద్మిని నిల్చుని ఉంది. 'యిదేం యిల్లా? బజారా! కొంచెం మెల్లగా మాట్లాడితే బాగుంటుంది. లేకపోతే, యిల్లు ఖాళీచేయవలసి ఉంటుంది' అని వెళ్లిపోయింది.

చిన్నగాలి దుమారం తగ్గినట్టయింది.

'ఛ! ఛ!! చెట్లంతేసి మగవాళ్ళని పట్టుకొని యిలాగంటుందేమిటీ? యీవిడ కేమయినా మర్యాద తెలుసునా అని!! అన్నాడు వాసు,

'అదే నేనూ అనబోతున్నాను. పూరంతటికీ వీళ్లగదే ఉన్నట్టు. దీనికి తాతల్లాంటి గదులు బొలెడన్ని.......' మిగతా మాటలు మింగేశాడు గోపీ.

'ఏంరా?' అని వెనక్కు తిరిగిచూసేసరికి ఆ అమ్మాయి మళ్ళా ప్రత్యక్షం.

'హుఁ,'అని విసవిసా నడిచి వెళ్లిపోయింది.

'ఒరేయ్! కాస్త మెల్లగా మాటాడండిరా బాబూ! మీకు పుణ్యముంటుంది!' అన్నాడు.

'అసలు మనం గట్టిగా మాట్లాడేమని ఆ అమ్మాయి అరచిందటరా! మనం గట్టిగా మాట్లాడేమని కోపమైతే తను గట్టిగా ఎందుకరిచిందో నువ్వే చెప్పు' అన్నాడు గోపీ.

'అదీ నిజమేన్రోయ్! మరిదేనికో ఆవిడకు అంతకోపం?' అన్నాడు వాసు.

'నువ్వు నామినేషన్ పడేసేటప్పుడు ఈవిడగారుకూడా పక్కనే ఉందంటకదూ? అదే అసలు మనసులోని ఉక్రోషం- దాన్ని బయట పెట్టలేక యీవిధంగా తన కసితీర్చుకుంది. సరే కానీలే! ఈవిడ గెల్చినప్పుడు చూదాం! నేనుగాని పట్టుపట్టానంటే....! అనబోయాడు గోపీ.

'యింక ఆపరా నీభాగోతం! మరి ఎడ్వర్‌టయిజ్‌మెంట్‌సంగతేంచేస్తావోయ్?' అన్నాడు వాసు నుద్దేశించి.

'ఆపాటి ఆలోచించకుండా వచ్చేశాననుకున్నావా? మనకు ఓటేసిన ప్రతీవాడికీ ఎసోసియేషన్‌లో సదవకాశాలు కల్పిస్తామనీ, గెలచినతర్వాత టీపార్టీ అనీ, కాలేజీ ఆవరణలో ఒక నుయ్యి త్రవ్విస్తాననీ.... యింకా.... యింకా....'

'నీమొకమనీ! ఏడిసినట్టే ఉంది నీ ఎడ్వర్‌టైజ్‌మెంటు. యిదేం మినిస్ట్రీషిప్పా? మున్సిపల్ కౌన్సిల్‌షిప్పా? నూతులూ చెఱువులూ త్రవ్వించడానికి' అన్నాను నేను చికాకుగా.

'మరేంచేద్దామంటావ్?' అన్నాడు గోపీ,

'సోదర సోదరీమణులారా! మీ ఓటు మాకు వెయ్యండి! మా కష్టంతో మీ సుఖ సౌధాన్ని నిర్మించుకోండి. ఆదర్శప్రాయుడ నైన నేను నిలబడడంవల్ల మన ఎసోసియేషన్ అభివృద్ధి గాంచగలదు! ఈ యేడాది నా సెక్రెటరీషిప్ చూస్తే, మళ్ళీ యేడాదికూడా నన్ను యిందులోనే ఉండిపొమ్మంటారు మీరు! యిలా కానివ్వాలిగాని' అన్నాను.

'అపరా! పదండి అచ్చాఫీసుకు వెళ్దాం.

ముగ్గురం బయలుదేరాం.

పేంపెట్లుకొట్టి పంచిపెట్టడమూ, వాల్ పోస్టర్లపని గోపీది. ప్రతీవాళ్ళదగ్గరకూ వెళ్ళి 'ఓటి'మ్మని అడగము మాదీను. యీ కార్య క్రమంలో మా మిత్రులు కొందరు సాయ పడ్డారు. ఈ విధంగా మా ప్రచారం బహు జోరుగా సాగింది. ఆఖరికి 'ఎన్నిక'ల రోజు వచ్చింది, నేను వేగరమే లేచి, స్నానంచేసి, డ్రసచేసుకొని గదితలుపు తాళంవేస్తున్నాను.

'ప్లీజ్' పద్మినిగొంతు వినిపించింది. ఆశ్చ ర్యంతో వెనక్కుచూశాను.

'మీతో కొంచెం మాట్లాడాలి' అంది.

'రండి' గది తలుపుతీసి, కుర్చీ చేత్తోదులిపి ఆమెను కూర్చోమన్నాను. ఎందుకో దిగులు పడుతున్నట్టుంది ఆమె ముఖం.

'నన్ను క్షమించాలి! ఆవేళ మిమ్మల్ని నొప్పించినట్లున్నాను.' అంది.

'ఫర్వాలేదు ఫర్వాలేదు!' అన్నాను నేను ఏమనాలో తోచక. ఆడపిల్లలతో మాట్లాడడ మంటేనే నాకు వణుకు. అందులో మా ప్రత్యర్థితో !!

'ఆ వేళ ఏదో చికాకులో ఉండి ఆ విధంగా అనవలసివచ్చింది'

'వచ్చిందీ! చచ్చాం !!' అనుకున్నాను మనస్సులో.

'మరేమీ అనుకోకండి'

'అబ్బే. అటువంటివి నా కలవాటేలేండి' ఆమె మనస్సు నొప్పించకూడదని ఈ మాట అన్నాను.

'చూడండి. మీ........'

'చెప్పండి. ఫరవాలేదు' కాస్త ధైర్యంగానే అన్నాను.

'మరేమీలేదు. మీవోటు నాకు వెయ్యమని అడగటానికి వచ్చాను.'

ఆశ్చర్యంవేసింది. నేను వాసుపక్క ప్రోప గాండా చేస్తున్నట్టు తెలిసికూడా ఈమె అడుగు తోందేం చెప్మా అనుకున్నాను.

'ఒరేయ్ మూర్తీ! ఇంకా డ్రస్సింగ్ అవలే దంట్రా? అవతల పోలింగ్ మొదలయితేనూ!' అంటూ పద్మినినిచూసి గుమ్మంలోనే ఆగి పోయాడు వాసు.

'నే వస్తానండి. నేను చెప్పింది మరచిపోరు గదూ!' నావేపు నవ్వుతూ చూస్తూ, వాసువేపు కొరకొరాచూస్తూ, ద్విపావధానంచేస్తూ వెళ్ళి పోయింది పద్మిని. ఆ క్షణంలో వాసుగాడి మొఖంలో రంగులుమారటం నేను కనిపెట్టక పోలేదు.

'ఒరి ఫూల్! యిదంట్రా నువ్వాడుతున్న నాటకం. వీధిలో నాపేరుతో ప్రోపగాండాచేసి, యింట్లో కుట్రజరుపుతున్నావంట్రా! కుట్రా!!' యింకేమేమో అనబోతున్నాడు వాసు. నేను కూడా నిజంచెప్పేద్దా మనుకొన్నాను.

'ఆపండి మీ అధికప్రసంగం! ఆ యన తాలూకు ఓటు నాది! అది, నేను రిజర్వు చేశాను. దానిమీదే మీకేమాత్రం అధికారం లేదు.' దూకుడుగా వస్తూ అన్నది పద్మిని.


'అంతవరకు వచ్చిం దీవ్యవహారం! నిజమే నంట్రా? మాట్లాడవేం?' వాసు ఏడుపుమొఖం అచ్చం శ్రీరంజని ముఖంలా కనుపించింది. ఏం చెప్పడానికీ తోచడంలేదు. నుయ్యి, గొయ్యిలమధ్యన ఉన్నాను. ఔనంటే వీడు నొచ్చుకుంటాడు. కాదంటే పద్మినికి కోపం.

సిగరెట్ పాకెట్ తీసి ఒకటి వెలిగిస్తూ అన్నాను. 'ముందు సిగరెట్ కాల్చరా! తర్వాత అంతా చెప్తాగా!'

'యిచ్చావ్లే బోడిసిగరెట్టు! యిదినాకు— ఓటు ఆవిడికీను!'

ఛ ఛ. శ్రీరంజనికూడా పనికిరాదు వీడి ఏడుపుముందు అనిపించింది. వీడైనా చెప్పి ఊరడించకపోతే యిక్కడ ఏడ్చేస్తాడేమోనని భయమేసింది నాకు.

'తర్వాత చెప్తాగా. ముందర సిగరెట్టు కాల్చరా' అన్నాను.



'యింకా తర్వాత చెప్పేదేమిటండీ? మిస్టర్ వాసూ! యిక మీరు వెళ్ళవచ్చు' మధ్యలో కలుగజేసుకొని అంది పద్మిని.

ఏమనడానికి పాలుపోలేదు నాకు.

'అం అం ఆడపిల్ల! అందులో మా ప్రత్యర్థి!! అలా మీదమీదకు, అందులోనూ ఒకమిత్రుడి మీదకు నీలాడ్డిలో, దూసుకువస్తుంటే చూస్తూ ఊరుకున్నావ్ కదురా!!! ఒరేయ్ మిత్ర ద్రోహీ! ఘాతకా!! నువ్వింత ద్రోహంచేస్తావని కలలోనూ, యిలలోనూ కూడా అనుకోలేదు. వస్తా. గుడ్ బై!' డ్రామాలో పోషన్ అప్పజెప్పి నట్టు చెప్పేసి, రుమాలుతో ముఖంతుడుచు కుంటూ వెళ్ళిపోయాడు వాసు.

'ఛీ! ఛీ!! యిదంతా యీ అమ్మాయి మూలంగానేకదా వచ్చింది. ఈమెతో అజాపజా తేల్చుకోవలసిందే! ఏమిటో ఈనాటకం?' అనుకుంటూ రయ్యిమని లేచాను.

'నేవస్తానండీ! మళ్ళా సాయంత్రం కలుద్దాం' నవ్వుతూ వెళ్ళిపోయింది పద్మిని.

ఐనలా కుర్చీలోనే కూర్చుండిపోయాను నేను, అయిదునిముషాలయాక తెలివివచ్చి నట్టయింది.

'ఛీఛీ. వెధవ ఓటు! నా ప్రాణాలు తీసేందుకుగాని, లేకపోతే యీ హక్కు నాకెందుకు చెప్పండి? యిది లేకపోయినా బాగుండును' అనుకుంటూ రూమ్ తాళంవేసుకొని బయలుదేరాను కాలేజీకి.

'చూడబ్బాయ్! మూర్తీ! నీకేదో ఉత్తరం వచ్చినట్టుంది!' అన్నారు యింటి యజమాని వుర్ఫ్ గోపాలరావుగారు.

ఉత్తరం తీసుకొని చదువుతున్నాను.

'కూర్చోవోయ్....యిదిగో....నిన్నే....రెండు కప్పులు కాఫీ పంపించు' అన్నారాయన.

'ఎందుకండీ? వీధిలోకి ఎలాగా వెళుతున్నానుగా! తాగుతాలెండి' అన్నాను.

'ప్రొహిబిషన్‌కదుటోయ్' అందుకే యింట్లో తాగమంటున్నాను' అన్నాడాయన గొల్లుమని నవ్వేస్తూ తనవిట్టుకి తనే మురిసిపోతూ.

నవ్వక తప్పలేదు నాకున్నూ. ఉత్తరం పూర్తిచేసి జేబులో పెట్టుకున్నాను.

'ఏమిటి సంగతులు?'

'మరేంలేదండి. మా అమ్మా నాన్న ఈ మెయిల్‌కి వస్తున్నామని రాశారు. కారణం రాయలేదు. ఎందుకో?' అన్నాను.

'అలాగా! సరే నువ్వెళ్ళుబాబూ ఏదో పని మీద వెళ్ళున్నట్టున్నావ్' అన్నారాయన కుర్చీ లోంచి లేస్తూ.

'వస్తానండీ. నమస్తే' అంటూ బయటకు దారితీశాను. 'ఓటుముందా? మెయిల్‌కి వెళ్లడం ముందా' అన్నవిషయం తర్కించుకుంటూ.

'సోదర మిత్రులారా! మనలో కొందరు మిత్రద్రోహులున్నారు. వారు తేనెపూసిన కత్తులు....' రాజకీయనాయకుని పోజులో కాలేజీదగ్గర మర్రిచెట్టుకింద ఉపన్యాసం దంచేస్తున్నాడు వాసు. వాడు చెప్తున్నది. వినటం కష్టమనిపించింది. వెంటనే స్టేషన్‌కి దారితీశాను.

నా పరిస్థితి ఏం బాగాలేదనిపించింది. 'అందరూ అనుకుంటున్నదొకటి. నా మనస్సులో నున్నది మరొకటి. ఛి ఛీ! మనదశ ఏం బాగాలేదు' అనుకుంటూ స్టేషన్ చేరాను.

అప్పటికే నాన్నగారు జట్కా బేరమాడుతున్నారు. జట్కావాడు సామాన్లు బండిలో పెట్టేసి 'రూపాయిన్నర యిస్తేనేగాని కట్టను బాబూ! యిష్టంలేకపోతే సామానులు దించేసుకొండి' అంటున్నాడు యన్. టి. రామారావులా పోజుపెట్టి. జట్కావాళ్ళూ, రిక్షావాళ్ళూ అమాయకులని, వాళ్లకితగిన కూలి కిట్టదని, సినిమాలు తీశాక, వీళ్లకి మరింత టెక్కు పెరిగినట్టుంది.

'వెధవది' మహారాణీపేటకి రూపాయిన్నరటోయ్! బస్సుమీదయితే పావలాకి వెళ్లిపోతాం తెలుసా!' అన్నారు నాన్నగారు.

'నిక్షేపంలా గెల్లిపోండి బాబూ! ఒద్దన్న దెవుడు'

నేను సమయానికి వెళ్లి, రూపాయికి బేరం కుదిర్చి, వుభయుల్నీ శాంతపర్చి, యిటు నాన్నగారి గొణుగుల్నీ, జట్కావాడి సణుగుల్నీ భరిస్తూ జట్కా ఎక్కాను. తోవలో 'ఏమిటమ్మా సంగతి?' అన్నాను.

'చెప్తాం పదవోయ్! జట్కాలోనే కావాలా వివరాలు?' అన్నారు నాన్నగారు.

నోరుమూసుకున్నాను. యిల్లు వచ్చింది. సామాన్లు దింపిస్తుండగా గోపాలరావుగారు, సతీమణివచ్చి ఆహ్వానించారు.

జట్కాను పంపేసిన తర్వాత 'భోజనం సంగతి....' అంటూ నసిగాను.

'ఆఁ భోజనాలకేంలేవోయ్. నీ ఎలక్షన్ గొడవలేవో చూసుకుని నువ్వూకూడా భోజనానికి యిక్కడకేరా' అన్నారు గోపాలరావుగారు.

నాన్నగారివేపు చూశాను.

'ఊఁ! వెళ్ళు' నవ్వుతూ అన్నారు.

'అలా వెళ్ళొస్తానమ్మా' అన్నాను.

'వెళ్లువెళ్లు. కాని అమ్మాయికి ఓటువెయ్యడం మాత్రం మరిచిపోకు' అన్నారు గోపాలరావుగారు గొల్లున నవ్వేస్తూ.

'ఈయన విట్టుకి ఈయనతప్ప మరొకడు నవ్వడ'నుకుంటూ కాలేజీకి బయలుదేరాను. తోవలో పద్మిని, బంట్రోతు ఎదురయ్యారు నాకు. నన్ను చూసి తల దించేసుకొంది పద్మిని. పలకరించలేదు! కనీసం పలకరింపు సూచనకై నవ్వనైనా నవ్వలేదు. నన్నుదాటి పోయింది.

'సరేలే ఓటు వేశేశాననుకొని ఉంటుంది. పాపం! నా ఓటు యింకా ఎవరికీ వెయ్యలేదని తెలిదేమో! నా ఓటు తప్పకుండా వాసుకే వేస్తాను' అనుకుంటూ కాలేజీ చేరాను. అక్కడ వాసు కనిపించికూడా చూడనట్టు వెళ్ళిపోతున్నాడు. వాడి చెయ్యిపట్టుకొని 'నిజం తెలియకుండా నువ్విలా అపోహపడటం ఏం బాగాలేదురా వాసూ! నా ఓటు తప్పకుండా నీదే! నన్నపార్థం చేసుకోకు' అన్నాను.

'ఫర్వాలేదు' అన్నాడు వాసు 'ఒరేయ్! ఈయనకి ఓ సోడా యియ్యరా అని, ఆ సోడా కుర్రాడికి అర్థణా యిచ్చేసి వెళ్ళిపోయాడు, తెల్లబోయాను. ఆ సోడాకుర్రాడు సోడాకొట్టి, కొద్దిగా నీళ్ళు మీదజల్లి 'సోడాసార్' అన్నాడు. 'తాగు' కోపంగా అంటూ పోలింగ్‌బూత్ దగ్గరికి వెళ్ళాను. ఓటుతీసుకొని లోపలికివెళ్ళి అక్కడున్న మూడుపెట్టెలలో ఏదో ఒకదాన్లో, కళ్లుమూసుకుని ఓటుపడేసి వచ్చేశాను.

యింటికి వెళ్లేసరికి, గోపాలరావుగారూ, నాన్నగారు ఏవో చర్చలలో ఉన్నట్టున్నారు. 'రావోయ్!' అన్నారు. 'అంతా సరిపోయింది. కాని పదిహేనోతారీఖున ముహూర్తమంటే....'

యిదా వీళ్లొచ్చినపని. నాకు చెప్పనైనాలేదే. మంచి చలిలో వేడి టీ తాగినట్టనిపిస్తోంది నాకు యిది వినగానే.

'టైము సరిపోదని నాకూ తెలుసు. కాని తర్వాత మూఢం. అర్నెల్లదాకా ముహూర్తాలు లేవు. ఈ లోపుగా మా అమ్మకోరిక తీరాలి. లేకపోతే....' ముక్కూ, కళ్ళూ ఉత్తరీయంతో తుడిచేరాయన.

'ఆఁహ! హఁ! ఎంతమాట. మీ సమ్మతమే నా సమ్మతం కానిండి.' అన్నారు నాన్నగారు.

'అరెరె! ఏవిటిది నేను గాలిలో తేలిపోవటం లేదుకదా!' అనిపించింది.

'బంగారంలాంటిపిల్ల' యివతలకు వస్తూ అంది అమ్మ.

'కి ముత్యంలాంటి పిల్లవాడు' కలిపేసింది మా అంటేనా ఫ్యూచర్ అత్తగారు! నిజం చెప్పొద్దూ. నాకు సిగ్గేసింది.

బుర్రవంచుకొని గదిలోకి వెళ్ళిపోయాను. అవతలనుండి మాటలు విన్పిస్తున్నయ్.

'మరి మన ప్రయాణంసంగతి?' అంటోంది అమ్మ.

'చూడండి అక్కయ్యగారూ!....'

'అబ్బో! అప్పుడే వరసలుకట్టేశాడే గోపాలరావుగారు' అనుకున్నాను.

'రేపుదయం బయల్దేరితే మధ్యాహ్నానికల్లా వెళిపోవచ్చు. లేకపోతే రాత్రి రెండుగంట

లకి దిగటం, బండి ప్రయాణం ఇవన్నీ ఉండనే ఉన్నాయి, అందుచేత....' అంటున్నాడు గోపాలరావుగారు.

'రేపు ఉదయం ప్రయాణం అని నిశ్చయించడమైనది' నవ్వుతూ అంటున్నారు నాన్నగారు.

ఆ రాత్రి కనీసం అరవందకలలైనా వచ్చి ఉంటాయని అంచనా.

తెల్లవారింది. అమ్మ నాన్న ప్రయాణమయారు. వాళ్లని దిగబెడదామని స్టేషన్‌కి బయలుదేరాను.

'నీ తాళం యిచ్చిపోవోయ్' అని గోపాలరావుగారు తాళం తీసుకున్నారు. అమ్మావాళ్లని ఒక కంపార్టుమెంట్‌లో ఎక్కించి 'వస్తానమ్మా' అన్నాను.

'చూడు! ముహూర్తం నిశ్చయంచేశాము. పదిహేనోతారీఖు పెళ్లి. నేను గోపాలరావుగారు అన్నివిషయాలు మాట్లాడుకున్నాం. ఆఁ! నీకేమీ అభ్యంతరం లేదుకదా?' అనుమానంగా ప్రశ్నించారు నాన్నగారు.

'లేద' ని బుర్ర ఊపాను. ఊగిందో లేదో అనుమానంవచ్చి 'లేదు' అని చెప్పాను.

'సరే వెళ్ళు, ఉత్తరం రాయగానే బయలుదేరిరా!' అన్నారు నాన్నగారు.

'వస్తానమ్మా' అన్నాను. ట్రెయిన్ కదిలింది.

'జాగ్రత్త నాయనా!' అంది అమ్మ కళ్ళు తుడుచుకుంటూ.

బయటకువచ్చి రిక్షా ఎక్కాను. నామనస్సు అనందంలో తేలియాడుతోంది. కాలేజీదగ్గర నుంచి రిక్షా వెళ్తోంది. అక్కడ ఒక స్టూడెంట్ నడిగాను ఎలెక్షన్ రిజల్ట్సు. వాసు ఓడిపోయాడు. పద్మ సెక్రెటరీగా ఎలెక్ట్ అయింది.

యింటికి వచ్చేసరికి నా గదీతలుపు తీసివుంది. నలుగురైదుగురు మనుషులు అందులోకి ఏవో బస్తాలు మోసుకొని వెళ్తున్నారు.

చూస్తూ నిలబడ్డాను గది గుమ్మందగ్గర. గదిలోంచి పద్మ బయటకువచ్చింది, చేతిలో తాళాలగుత్తితో. నన్ను చూడగానే, తలవంచుకొని 'మీసామాన్లు మేడ మీద గదిలోకి మార్చారు' అంది.

'ఏగది?' అన్నాను మాట్లాడలేదు.

'చూపించండి' అన్నాను.

నేను బహువచనం వుపయోగించినందుకేనేమో,నవ్వుతూ 'రండి' అంటూ మేడమీదకు దారితీసింది. 'యీ గది' చాలా పెద్దదే. రెండు కిటికీలు గాలి బాగా వస్తుంది. మంచం, కుర్చీలు, టేబిల్, పైన ఫేన్, రేడియో వున్నాయ్. ఆమెవేపుచూశాను. నన్నుచూస్తున్న దృష్టి తప్పించి వెనక్కి తిరిగింది.

చెయ్యిపట్టుకుని దగ్గరకు లాక్కున్నాను.

'వదలండి. ఎవరేనా చూస్తారు!' అంది పద్మ చుట్టూ భయంగా చూస్తున్నట్టు నటిస్తు.

'అంతా వట్టిదే. ఈటైమప్పుడు మీద కెవరొస్తారు' అని మనస్సులో అనుకొని 'చూడకపోతే, ఎవరూ రాకపోతే ఫరవా లేదా?' అన్నాను.

నవ్వింది పద్మ. కాదు కాదు. మల్లెలవర్షం కురిపించింది.

'నువ్వు గెల్చావు'

'ఏమిటో?'

'సెక్రిటరీషిఫ్ అఫ్. కల్చరల్ ఎసోసియేషన్'


'యిక ఆవసరంలేదుగా'

'ఏం?'


'యివ్వాళ్లనుండి నేను, కాలేజీ మానేస్తున్నాను' అంటూ చెయ్యి విడిపించుకొని, కిందకి పరుగెత్తింది.

'ఆహాఁ! ఇండియాలో స్త్రీలు!! చదువో, పెళ్లో, ఏదో ఒకటే వీళ్ళకు కావల్సింది' అని స్వగతంలో అనుకుంటూ రేడియో అన్‌చేసి, కమ్మనిపాటలు వింటూ, కలత నిదురలోకి దొర్లిపోయాను.

★

# మీరు కోరినవన్నియు సమకూడును



నమ్మకాన్ని విడవకండి! మీకార్యములన్నియు సమకూడును!! ఆశలన్నియు నెరవేరును!!! సూర్యచంద్రగ్రహణములలో పరిశుద్ధము చేయబడినది. ఈ మాంత్రిక ఉంగరమును ధరించినచో మీరు ప్రేమించిన ఏ స్త్రీ యయినను ఎంతదూరంలో ఉన్నదయినను, మీ పాదాక్రాంతమై మీరు చెప్పినటుల చేయుటకు సిద్ధపడుదురు. అన్ని అడ్డంకులను, విరోధములను జయించి మీరు ప్రేమించినవారినే పెండ్లిచేసుకొనవచ్చును. వ్యవహారములు, వర్తకము, చేతిపనులు, పరీక్ష మున్నగువానిలో విజయమును పొందవచ్చును. చెడ్డగ్రహములవలన యేర్పడునట్టి దుష్ఫలితములు మారి అదృష్టదేవతానుగ్రహమునకు పాత్రులు కాగలరు. దీర్ఘాయువు, ఎనలేని అయిశ్వర్యము, శాంతి సమాధానములతో జీవింపగలరు.



| | |
|---|---|
| మాంత్రిక ఉంగరము ఖరీదు | 1—15—0 |
| స్పెషల్ ఉంగరము | 3— 0—0 |
| స్పెషల్‌శక్తిని పొందినది | 3—15—0 |

విద్యుద్వేగములో ఫలితమిచ్చునది. ఫలితములేనిచో ఉంగరము ఖరీదు వాపస్. (తపాలఖర్చు వేరు)

RAJ JYOTISHI Pt. DEV DUTT SHASTRI TANTRIK, (C.G.M.) JULLUNDUR CITY, E. PUNJAB.